# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 337 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 21, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## నీట్ అవకతవకలపై ఉన్నతస్థాయి కమిటీ

● కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



న్యూఢిల్లీ,జూన్20(నమస్తే ఉదయం): వైద్య విద్య కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరణ ఇచ్చారు. ఈ పరీక్షలో జరిగిన తప్పులు నిర్దిష్టమైన ప్రాంతాలకు మాత్రమే పరిమితమని, ఉత్తీర్ణత సాధించిన లక్షలాది మందిపై ప్రభావం ఉండదన్నారు. నీట్ వ్యవహారంపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలో అవకతవకలపై బిహార్ ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. అవసరమైతే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. మిగతా.. 2లో

## తెలంగాణ గుండెచప్పుడు జయశంకర్ సార్

### వర్ధంతి సందర్భంగా సిఎం రేవంత్ సంస్మరణ



హైదరాబాద్,జూన్20(నమస్తే ఉదయం): తెలంగాణ సిద్ధాంత కర్త, జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి జూన్ 21సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆయనను స్మరించుకున్నారు. జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడు జయశంకర్ అని సీఎం అన్నారు. సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడంతో పాటు జనాన్ని జాగృతం చేయటంలో ఆయన కీలక పాత్ర పోషించారని, తుది శ్వాస వరకు తెలంగాణ కోసమే పరితపించారని గుర్తు చేసుకున్నారు. అందుకే తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. తన అనుభవాన్ని మొత్తం తెలంగాణకు ధారపోసి, రాష్ట్ర ఏర్పాటుకు ముందే అన్ని రంగాల్లో రాష్ట్రానికి ఉన్న ఉజ్వల భవిష్యత్తును వీక్షించిన స్వాప్నికుడు జయశంకర్ అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేటను రెవెన్యూ విలేజ్‌గా ప్రకటించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



సీఎం రేవంత్ రెడ్డిని సన్మానిస్తున్న ఆషాఢ మాస బోనాల ఉత్సవాల కమిటీ ప్రతినిధులు

## బోనాల ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు

### వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ సీఎంకు సన్మానం.

### ఈసారి జరిగే బోనాల జాతరకు ఆహ్వానం అందజేసిన ఉమ్మడి కమిటీ చైర్మన్ గాజుల ఆంజయ్య

హైదరాబాద్, జూన్ 20(నమస్తే ఉదయం): రానున్న ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా సత్కరించారు. ఈసారి జరిగే బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా కన్నుల పండుగ జరిగేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గాజుల అంజయ్య ముఖ్యమంత్రిని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్లు పొటేల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ గౌడ్, ఆలే భాస్కర్ రాజ్ లతోపాటు ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, దినేష్, హాన్స్ రాజ్, కైలాస్, వెంకటేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిని కాపాడుకుంటాం...

● అవసరమైతే ప్రధానిని కలుస్తాం
● వేలాదిమంది కొంగుబంగారం సింగరేణి
● డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మం,జూన్20(నమస్తే ఉదయం): సింగరేణిని కాపాడుకునేందుకు ప్రధానిని కలుస్తామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విపక్షనేతలను కలుపుకుని వెళ్లి కలసి పరిస్థితిని వవరిస్తామని అన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి.. ఈ సంస్థ తెలంగాణకు తలమానికమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి బంద్ అయిపోతే ఆ ప్రాంతంలో ఉన్న వేలాది మంది ఉద్యోగాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్థ కోసం దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనీ కలుస్తామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల వారిని కలుపుకుని ప్రధానిని కలుస్తామని తెలిపారు. తెలంగాణ ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తాం, రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాల కోసం తాము ఈ పని చేస్తామని తెలిపారు. ఇవన్నీ రాష్ట్ర ప్రయోజనాల కోసం చేస్తున్నావేనని అన్నారు. తమకు మద్దతు తెలిపిన సీపీఐ, మిగతా రాజకీయ పార్టీలను కలుపుకుని మోదీ దగ్గరకు వెళ్తామని వివరించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం మల్లు భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరానికి సంబంధించి, రాష్ట్ర, దేశ ప్రజలకు తెలియాలని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల అవసరాలు గురించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలంమొదలు పెడుతుందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో వేలం జరగబోతుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు రాష్ట్రాన్ని పాలించింది. తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులకు విఘాతం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం మాటలు ఉన్నాయి. దాదాపు నలభై రెండు వేల మంది ఉద్యోగస్తులు నేరుగా సింగరేణిలో పని చేస్తున్నారు, 26 వేల మంది ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. ఇన్ని వేల మందికి ఉద్యోగాలు కల్పించే సంస్థ గురించి రాష్ట్ర ప్రజలకు తెలియాల్సి ఉంది. 40 బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న 70 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి 2026 కి పూర్తిగా పడిపోతుంది. బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని 2031, 32 వరకు నిలబెట్టుకోవాలన్న సింగరేణి కొత్త బొగ్గు గనులను సంపాదించుకోవాలి. లేదా సింగరేణి అనేది చరిత్రలా నిలిచిపోతుంది. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ కాబట్టి, నేరుగా జీ 2 జీ చేయాలి. కేంద్రంలో ఉన్న బీజేపీ 1957 చట్టం ప్రకారం సవరణ తీసుకుని వచ్చి దేశంలో ఉన్న బొగ్గు గనులు అన్నింటినీ ఆక్షన్ ద్వారా నిర్వహించే విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇకపోతే తెలంగాణ ప్రయోజనాల గురించి బీఆర్ఎస్ మాట్లాడటం సరికాదని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ ఇప్పుడు మేము పదేళ్లు సింగరేణిని కాపాడమని మాట్లాడుతున్నారు. 2021 అక్టోబర్ 29వ తేదీన ఒక సమావేశం ఏర్పాటు చేశారు. నవంబర్ 5 న గత సీఎం కేసీఆర్ ఒక కోర్ కమిటీ నిర్వహించారు. కేసీఆర్ గోదావరి ప్రాంతాల గనులు తీసుకోకూడదని ఆదేశాలు జారీ చేశారు. రెండు కంపెనీలు బీఆర్ఎస్ పార్టీకి దగ్గరి వాళ్లవి కాబట్టి సింగరేణికి కాకుండా వాళ్లకు ఇచ్చేశారు. ఒరిస్సాలో బల్క్ ఈ బ్లాక్ అని ఉంది. దాని ఒక్కదానికి బిడ్ వేయాలని ప్రయత్నం చేశారు. ఇప్పుడు కూడా తెలంగాణ మీద ప్రేమ ఉన్నట్లు బీజేపీ మంత్రులు మాట్లాడుతున్నారు. తెలంగాణలో తలమానికంగా ఉన్న ఈ శాఖ మీ దగ్గరకు వచ్చింది. సింగరేణి తరఫున రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బొగ్గు గనుల శాఖ మిగతా.. 2లో

## సింగరేణిపై కేంద్రం ద్వంద్వ వైఖరి

● ప్రభుత్వ రంగ సంస్థలకే గనుల కేటాయింపు జరగాలి
● మా ఆలోచన సింగరేణి సంస్థకి చెప్పాం
● మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్,జూన్20(నమస్తే ఉదయం): కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణి కేంద్ర.. మిగతా.. 2లో





## ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

● గ్రూప్ ఉద్యోగాల అభ్యర్థులు ధర్నా
● కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ ధర్నా

హైదరాబాద్,జూన్20(నమస్తే ఉదయం): గ్రూప్-2 ఖాళీలను 2వేలు, గ్రూప్-3 పోస్టులను 3వేలు పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గ్రూప్ ఉద్యోగాల అభ్యర్థులు, నిరుద్యోగ యువత గురువారం ధర్నా చౌక్ వద్ద భారీ నిరసనకు దిగారు. మిగతా.. 2లో



## కేబినెట్ విస్తరణపై కసరత్తు ముమ్మరం

● విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్!
● జులై మొదటివారంలో కేబినెట్ విస్తరణకు చాన్స్

హైదరాబాద్,జూన్20(నమస్తే ఉదయం): స్థానిక సంస్థల ఎన్నికల వేళ కేబినెట్ విస్తరణ దృష్టి సారించారు సిఎం రేవంత్‌రెడ్డి. ఈ వ్యవహారంపై ఇప్పటికే కాంగ్రెస్ హైకమాండ్‌తో మంతనాలు జరిపారు. దాదాపు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు అంతర్గత సమాచారం. తెలంగాణలోని ముఖ్యనేతలు ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలతో తమకున్న సంబంధాల ద్వారా లాబీయింగ్ మొదలు పెట్టారు. అంతా అనుకున్నట్లు జరిగితే జులై మొదటి వారంలో కేబినెట్ విస్తరణ ఉంచవచ్చని అంటున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రితోపాటు 12 మంది మంత్రివర్గంలో ఉన్నారు. మరో ఐదారుగురు మిగతా.. 2లో

## నిప్పుల కొలిమిలా "హజ్ యాత్ర"..


● హీట్ వేవ్‌కు 1000కి పైగా మృతి
● మృతుల్లో 68 మంది భారతీయులు

న్యూఢిల్లీ,జూన్20(నమస్తే ఉదయం): ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే "హజ్ యాత్ర" యాత్రికులు పిట్టల్లా రాలిపోతున్నారు. దారుణమైన వేడి కారణంగా మరణాలు సంభవిస్తున్నాయి. ఇప్పటివరకు 68 మంది భారతీయులతో పాటు





కనీసం 1000 మంది వరకు వేడి కారణంగా మరణించినట్లు రిపోర్టులు తెలుపుతున్నాయి. గురువారం కొత్తగా నమోదైన మరణాల్లో ఈజిప్ట్ దేశానికి చెందిన 58 మంది ఉన్నారు. ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లిన వారిలో మరణించిన వారి సంఖ్య 1000ని దాటింది. ఈజిప్టు నుంచే ఎక్కువ మంది మరణించిన వారు ఉన్నారు. ఈ ఒక్క దేశం నుంచే 658 మంది మరణించారు. మరణించిన 630 మందిని గుర్తించాల్సి ఉంది.ఇండియా నుంచి యాత్రకు వెళ్లిన వారిలో 68 మంది మరణించినట్లు సౌదీ దౌత్యవేత్తలు చెప్పారు. వేడి కారణంగానే మరణాలు చోటు చేసుకుంటున్నట్లు సౌదీ మిగతా.. 2లో



## దక్షిణ చైనా సముద్రంలో చైనా దుశ్చర్య

● గాల్వాన్ తరహాలో చైనా సైన్యం దురాగతం
● ఫిలిప్పీన్స్‌పై గొడ్డళ్లు, కత్తులతో దాడి

న్యూఢిల్లీ,జూన్20(నమస్తే ఉదయం): వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ కంట్రీ చైనా ఆర్మీ రెచ్చిపోతోంది. చిన్న దేశాలైన ఫిలిప్పీన్స్, బ్రూనై, వియత్నాం వంటి దేశాలను భయపెడుతోంది. తమది మిగతా.. 2లో





## వడదెబ్బతో ఉత్తరాది ఉక్కిరిబిక్కిరి

● పలు రాష్ట్రాల్లో తీవ్ర వడగాలులు, ఉష్ణోగ్రతలు
● దేశవ్యాప్తంగా 110 మంది మృతి
● 40 వేల హీట్ స్ట్రోక్ కేసులు నమోదు

న్యూఢిల్లీ,జూన్20(నమస్తే ఉదయం): ఉత్తరాది రాష్ట్రాల్లో వడగాలులు, ఉష్ణోగ్రతలు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జూన్ మాసం చివరికి వచ్చినా కూడా ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో వేడి తీవ్రత తగ్గలేదు. మార్చి నెల నుంచి ఇప్పటి వరకు దేశంలో 110 వడదెబ్బ మరణాలు నమోదైనట్లు కేంద్రం ఆరోగ్యమంత్రిత్వ శాఖ డేటా వెల్లడించింది. దీంతో పాటు వేసవిలో మొత్తం 40,272 వడదెబ్బ కేసులు నమోదయ్యాయి.అత్యధిక మరణాలు ఉత్తరప్రదేశ్ (36), ఆ తర్వాతి స్థానాల్లో బీహార్ (17), రాజస్థాన్ (16) ఉన్నాయి. ముఖ్యంగా, మే నెలాఖరు వరకు 56 మంది హీట్‌స్ట్రోక్ మిగతా.. 2లో

## నీట్ అవతవకలపై మోడీ నోరు మెదపరేం

● లీకు ఆరోపణలు వస్తున్నా చర్యలు లేవా
● మోడీ ప్రభుత్వంపై మండిపడ్డ రాహుల్

న్యూఢిల్లీ,జూన్20(నమస్తే ఉదయం): నీట్ పరీక్షలో అక్రమాలు, యుజిసి-నెట్ రద్దుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మానసికంగా కుప్పకూలిన ప్రధాని నరేంద్ర మోడీ ఈ తరహా ప్రభుత్వాన్ని నడపడానికి అష్టకష్టాలు పడతారని రాహుల్ వ్యాఖ్యానించారు. గురువారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ విద్యా సంస్థలను కబ్జా చేయడమే పేపర్ లీకులకు ప్రధాన కారణమని ఆరోపించారు. ఆ పరిస్థితి మారనంత వరకు ప్రశ్నా పత్రాల లీకులు ఆగబోవని ఆయన చెప్పారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో మోడీ మౌలిక భావనను ప్రతిపక్షాలు ధ్వంసం చేశాయని, వినమ్రంగా ఉండే అటల్ బిహారీ వాజ్‌పేయి లేదా మన్మోహన్ సింగ్ వంటి ప్రధాని మిగతా.. 2లో





వనపర్తి జిల్లా నూతన కలెక్టర్ ఆదర్శ సురభి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ వామన్ గౌడ్



నూతన కలెక్టర్ ఆదర్శ సురభిను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని మర్యాద పూర్వకంగా కలిసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్, జిల్లా పరిషత్ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ వామన్ గౌడ్

**కొత్తకోట, జూన్ 20(నమస్తే ఉదయం):**
వనపర్తి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆదర్శ సురభిని గురువారం వనపర్తి జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ గుంద్రాతి వామన్ గౌడ్‌లు పుష్పగుచ్ఛం అందజేసే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు అధికారిక బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌కి పూలబోకే శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

వనపర్తి జిల్లా అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని పాలనా పారదర్శకంగా ఉండాలని వారు కోరారు.

**నూతన కలెక్టర్ ఆదర్శ సురభికు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జిఎంఆర్**

వనపర్తి జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ఆదర్శ సురభి ని వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సింగరేణిని కాపాడుకుంటాం...

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి కిషన్ రెడ్డిని కలుస్తాం.రాష్ట్రంలో నిజంగా సమయం తీసుకుని ప్రధానిని, కిషన్ రెడ్డిని అందరం కలిసి కలుద్దాం. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా 0.5 పర్సెంట్ చూపించి కేంద్ర ప్రభుత్వాన్ని కోరతాం. ఆ రెండు బ్లాక్‌లు కూడ మేము అడుగుతాం ఆ రెండు సంస్థల సమయం కూడా మించి పోయింది కాబట్టి వాటిని ఇతర కంపెనీలకు ఆక్షన్ పెట్టకుండా అడుగుతాం. ఎవరో వ్యక్తి అంటున్నాడు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పని చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్ కానీ ఇంకా ఎవరైనా మాట్లాడటానికి, చర్చకు కాగితాలతో రావాలని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

## సింగరేణిపై కేంద్రం ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వంకి సంబంధించిందని ఆయన అన్నారు. సింగరేణికే గనులు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నట్టు స్టేట్మెంట్ ఇచ్చారు కిషన్ రెడ్డి అని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలకే బొగ్గు గనుల కేటాయింపు జరగాలన్నారు. కేంద్ర నిర్ణయం సరికాదు.. రాష్ట్రంలో ఉన్న గనులు ప్రభుత్వ సంస్థలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని, సీఎం త్వరలో ప్రధాని ని కలుస్తారని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర సమస్యలు..సహకారం.. సింగరేణి అంశాలు ప్రధాని దృష్టికి తీసుకెళ్తారని, వేలంలో పాల్గొనాలో వద్దో నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు. మా ఆలోచన సింగరేణి సంస్థ కి చెప్పామని శ్రీధర్ బాబు అన్నారు. శాంతి భద్రతల విషయం లో కఠినంగా ఉంటామని, ఉక్కుపాదం తో అణచివేస్తామని ఆయన తెలిపారు. ఏపీ ప్రభుత్వం నుండి నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదని, బీఆర్ఎస్ ఆలోచన చూస్తుంటే జాలి వేస్తుందని ఆయన అన్నారు. టీడీపీ నుండి నేర్చుకోవాలని అనుకుంటున్నారు వాళ్ళు అని ఆయన వ్యాఖ్యానించారు. స్పీడ్ గా నిర్ణయాలి తీసుకుంటే కాళేశ్వరం లెక్క ఐతదని, మేడిగడ్డ విషయంలో %చీణూాా% నివేదిక మేరకే పనులు అని ఆయన తెలిపారు. రిపేర్లు చేసినా..కూలిపోదు అనే గ్యారంటీ లేదు అని నిపుణుల కమిటీ చెప్పిందన్నారు. ఇసుక సిల్ట్.. నిపుణుల సూచన మేరకే తీస్తుందని, ధర్నా చేస్తున్న విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ అని, మీ ఆలోచన మేరకు ఉద్యోగాల భర్తీ అని ఆయన వ్యాఖ్యానించారు.

## దక్షిణ చైనా సముద్రంలో చైనా దుశ్చర్య

(మొదటి పేజీ తరువాయి)

కాకున్నా, తమదిగా చెప్పుకుంటూ దక్షిణ చైనా సముద్రంలో ఆధిపత్యం చెలాయించాలని చూస్తోంది. ముఖ్యంగా ఇటీవల పలు సందర్భాల్లో ఫిలిప్పీన్స్ కోస్టుగార్డు నౌకలపై దాడులకు తెగబడింది. ఈ దేశాలను కవ్విస్తూ దాడులకు ప్రేరేపిస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా చైనా కోస్టుగార్డు దళాలు దారుణానికి ఒడిగట్టాయి. దక్షిణ చైనా సముద్రంలో వ్యూహాత్మక రీఫ్‌కు సమీపంలో ఉన్న నౌకాదళ నౌకపై చైనా కోస్ట్‌గార్డ్ నావికులు కత్తులు మరియు గొడ్డలితో నిరాయుధ ఫిలిప్పీన్స్ సైనికులపై దాడి చేశారు. 2020లో భారత, చైనా సరిహద్దుల్లోని గాల్వాన్ లోయలో భారత సైనికులపై చేసిన దాడి తరహాలోనే ఫిలిప్పీన్స్ దళాలపై చైనా కోస్టుగార్డు సిబ్బంది గొడళ్లు, కత్తులతో దాడికి తెగబడ్డారు. దీనికి సంబంధించిన వివరాలను ఫిలిప్పీన్స్ విడుదల చేసింది. సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సియెర్రా మాడ్రే అనే శిథిలావస్థలో ఉన్న యుద్ధనౌకలో ఉన్న మెరైన్‌లను తరలించే సమయంలో ఫిలిప్పీన్స్ దళాలను చైనా కోస్టుగార్డు అడ్డుకుంది. ఫిలిప్పీన్స్ మిలిటరీ బుధవారం విడుదల చేసిన ఫుటేజీలో చైనా సైనికులు అరవడం, కత్తులతో దాడులకు పాల్పడవం వంటికి కనిపించాయి. గొడ్డలి పట్టుకున్న చైనా సైనికుడు ఫిలిప్పీన్స్ సైనికుడిపై దాడి చేస్తానని బెదిరించడం వంటి ఈ వీడియోల చూడొచ్చు. ఓ సైనికుడు తన బొటనవేలిని కోల్పోయినట్లు ఫిలిప్పీన్స్ మిలిటరీ తెలిపింది. అయితే, చైనా మిలిటరీ మాత్రం తమవాళ్లు ఎలాంటి దాడులకు పాల్పడలేదని చెబుతూ ఓ ఫోటోను విడుదల చేసింది. ఇందులో చైనా దళాలు ఆయుధాలను కలిగి ఉన్నట్లు చూపలేదు. తన కోస్ట్‌గార్డు సంయమనం పాటించినట్లు, ఫిలిప్పీన్స్ సిబ్బందిపై ఎలాంటి దాడి చేయలేదని బుకాయించింది. చైనా కోస్టుగార్డు సముద్రపు దొంగల్లా దాడికి తెగబడ్డారని ఫిలిప్పీన్స్ ఆర్మీ ఆరోపించింది. దక్షిణ చైనా సముద్రం తమదిగా చెప్పుకుంటున్న చైనా, సరిహద్దు దేశాలను భయపెడుతోంది. ముఖ్యంగా ఫిలిప్పీన్స్‌ని టార్గెట్ చేస్తోంది. గత కొంత కాలంలో ఫిలిప్పీన్స్ ప్రజా నౌకలు, విమానాలు, సాయుధ బలగాలు మరియు కోస్ట్‌గార్డ్‌పై చైనా ఆర్మీ దాడులకు తెగబడుతోంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ సముద్రం నుంచి ఫిలిప్పీన్స్‌ని బయటకు నెట్టేందుకు చైనా ప్రయత్నిస్తోందని నిపుణులు చెబుతున్నారు. గతంలో గాల్వాన్ తరహా దాడినే ఫిలిప్పీన్స్‌పై చేయాలని చైనా భావిస్తోంది. 2020లో భారత్‌తో జరిగి దాడిలో 20 మంది భారతీయ సైనికులు మరణించారు.

## నిప్పుల కొలిమిలా “హజ్ యాత్ర”

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు వెల్లడించారు. మరణించిన వారిలో ఇండోనేషియా, ఇరాన్, సెనెగల్, ట్యునీషియా, ఇరాక్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు ధృవీకరించారు. గతేడాది 200 మందికి పైగా యాత్రికులు మరణించారు. సౌదీ అరేబియాలో ఆదివారం రోజు 2700 కంటే ఎక్కువ వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. ప్రతీ ఏడాది కూడా మరణాలు చోటు చేసుకుంటున్నప్పటికీ, ఈ ఏడాది మాత్రం అనూహ్యంగా మరణాల సంఖ్య 1000ని దాటింది. హజ్ యాత్రకు కేంద్రంగా ఉన్న మక్కాలో ప్రతీ దశాబ్ధం ఉష్ణోగ్రత 0.4 డిగ్రీల సెల్సియస్ పెరుగుతోంది.

## వడదెబ్బతో ఉత్తరాది ఉక్కిరిబిక్కిరి

(మొదటి పేజీ తరువాయి)

మరణాలు, 24,849 కేసులు మాత్రమే నమోదయ్యాయి. మరోవైపు దేశరాజధాని ఢిల్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు, వేడిగాలులలతో నిప్పుల కొలిమిలా ఉంది.ఇదిలా ఉంటే, కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డా బుధవారం దేశంలో వడగాలుల పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. హీట్‌వేవ్‌పై రాష్ట్రాలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ మార్గదర్శకాలు జారీ చేశారు. వడదెబ్బకు గురైన వారికి అందిచాల్సిన చికిత్స, ప్రత్యేక ఏర్పాట్ల గురించి సమీక్షించారు. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు రావొద్దని, ఎక్కువగా ద్రవాహారం తీసుకోవాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

## నీట్ అవతవకలపై మోడీ నోరు మెదపరేం

(మొదటి పేజీ తరువాయి)

ఉండి ఉంటే ప్రభుత్వం మనుగడ సాగించి ఉండేదని రాహుల్ చెప్పారు. ఆసక్తికరమైన రోజులు ముందున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.
పార్లమెంట్‌లో తన స్పీకర్ ఉండాలన్న తాపత్రయమే తప్ప నీట్ పరీక్ష కారణంగా వేదనను అనుభవిస్తున్న లక్షలాది మంది వ్యార్థుల గురించి ప్రధాని మోడీకి ఇప్పుడు పట్టదని రాహుల్ విమర్శించారు. ప్రతిపక్షాలు కొట్టిన దెబ్బతకు కుదేలైపోవడం వల్లే ప్రధాని మోడీ మౌనాన్ని ఆశ్రయించారని, ప్రస్తుతం ఆయన అజెండా స్పీకర్ ఎంపిక మాత్రమేనని రాహుల్ ఎద్దేవా చేశారు. నీట్ గురించి ఆయనకు ఏమీ పట్టదని రాహుల్ చెప్పారు. స్పీకర్ పదవి తన పార్టీకే దక్కాలని, తన ప్రభుత్వం గ్టటెక్కాలని మాత్రమే మోడీ ఇప్పుడు ఆలోచిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మోడీ దృష్టిలో ప్రభుత్వాన్ని నడిపించడమంటే ప్రజలను భయపెట్టి వారి నోళ్లు మూయించడమని, ఇప్పుడు మోడీని చూసి ప్రజలు భయపడే పరిస్థితి లేదని రాహుల్ చెప్పారు. ఉక్రెయిన్?రష్యా యుద్దాన్ని, ఇజ్రాయెల్? గాజా యుద్దాన్ని ప్రధాని మోడీ ఆపారని చెప్పుకునే వారు. అయితే ఆయనకు(మోడీకి) పరీక్ష పత్రాల లీకులను ఆపడం సాధ్యం కాదా లేక ఆపడం ఇష్టం లేదా అంటూ రాహుల్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తన భారత్ జోడో న్యాయ యాత్ర సందర్భంగా పేపర్ లీకుల గురించి వేలాది మంది ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. వ్యాపం కుంభకోణాన్ని దేశమంతటా విస్తరించాలన్న ఆలోచన ఉన్నట్లు కనపడుతోందని బిజెపిని ఉద్దేశించి రాహుల్ ఆరోపించారు. ఏ విషయంపైన ఏకపక్ష నిర్ణయం జరగకూడదని, ఒక ప్రశ్నాపత్రానికి వర్తించే నిబంధన అన్నిటికీ వర్తించాలని ఆయన చెప్పారు. పరీక్షా పత్రాల లీకుల అంశాన్ని ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో లేవనెత్తు తాయని, తగిన చర్యలు తీసుకుని ఉన్నత ప్రమాణాలను నిలబెట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాయని ఆయన తెలిపారు.

## ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా వేదిక వద్దకు చేరుకున్న నిరసనకారులు గ్రూప్-1 మెయిన్ పరీక్షకు అభ్యర్థుల ఎంపికను 1:50 నిష్పత్తిలో కాకుండా 1:100 నిష్పత్తిలో పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దశాబ్దం విరామం తర్వాత గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలైనందున, 563 గ్రూప్-ఐ పోస్టుల భర్తీలో ప్రభుత్వం తమకు తగిన అవకాశం కల్పించాలని ఆశావహులు కోరుతున్నారు. గ్రూప్-II , III పరీక్షలను డిసెంబర్ వరకు వాయిదా వేయడం, ప్రభుత్వ , స్థానిక సంస్థల పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం మెగా డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ నోటిఫికేషన్, GO 46ను రద్దు చేయడం , రెసిడెన్షియల్ విద్యా సంస్థల రిక్రూట్‌మెంట్‌కు ఎంపికైన అభ్యర్థులకు రిలింక్విష్‌మెంట్ ఎంపికను అందించడం. నిరుద్యోగ యువత లేవనెత్తిన ఇతర డిమాండ్లు. నల్గొండ నుంచి వచ్చిన సింధూజ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత నిరుద్యోగ యువత సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని తెలిపారు. “మేము రాహుల్ గాంధీతో లేవనెత్తిన అదే డిమాండ్లు , ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వాటిని పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ నినాదం - మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి - అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతను ఆకర్షించడానికి ఎరగా ఉపయోగించారు , ఇప్పుడు వారు తప్పిపోయారు, “అని ఆమె అన్నారు.

## నీట్ అవకతవకలపై ఉన్నతస్థాయి కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

పారదర్శకంగా పరీక్షల నిర్వహణె తమ తొలి ప్రాధాన్యమని.. విద్యార్థుల ప్రయోజనాల విషయంలో రాజీ పడేది లేదన్నారు. తప్పు చేసిన ఎవరినీ ఉపేక్షించబోమని చెప్పారు. విద్యార్థుల విషయంలో రాజకీయాలు చేయవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



ఎల్లంపల్లి పంపింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి

# ఎల్లంపల్లిలో ఎమర్జెన్సీ పంపింగ్ పనుల పరిశీలన

**ఎల్లంపల్లిలో ఎమర్జెన్సీ పంపింగ్ ప్రారంభం.**

**మొత్తం 20 పంపుల ఏర్పాటు - ప్రస్తుతం ఏడు పంపుల ద్వారా నీటి ఎత్తిపోత**

**నీటి లభ్యతను బట్టి దశలవారీగా మిగతా పంపుల ప్రారంభం వెల్లడించిన ఎండీ సుదర్శన్ రెడ్డి**

**ఎనిమిదేళ్ల తర్వాత ఎల్లంపల్లిలో ఎమర్జెన్సీ పంపింగ్**

**హైదరాబాద్, జూన్ 20(నమస్తే ఉదయం):**
నగర ప్రజలకు మంచినీటి సరఫరా లో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి తెలిపారు. గురువారం ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముర్మూర్ వద్ద ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ పంపింగ్ పనుల్ని ఎండీ సుదర్శన్ రెడ్డి జలమండలి అధికారులతో కలిసి ప్రాజెక్టుకు వెళ్లి.. పంపింగ్ పనులు పరిశీలించారు.

ఎండీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మహా నగరానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ఉండేందుకు.. ముందు జాగ్రత్త చర్యలుగా పంపింగ్ ప్రారంభించామని తెలిపారు. మొత్తం 20 పంపులు ఏర్పాటు చేశామన్నారు. వాటిల్లో ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీరు ఎత్తిపోస్తున్నట్లు వెల్లడించారు. అవసరాన్ని, నీటి లభ్యతను బట్టి.. మిగిలిన పంపులను కూడా దశల వారీగా ప్రారంబి స్తామని పేర్కొన్నారు. గోదావరి పథకం ద్వారా నగరానికి 168 ఎంజీడీల నీరు తరలించనున్నట్లు వివరించారు.

**నీటి కొరత రాకుండా..**

వర్షపాతం తక్కువ నమోదు కావడంతో ఎగువనున్న కడెం ప్రాజెక్టు నుంచి ఎలాంటి వరద లేదు. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా తగ్గడం ప్రారంభమైంది. ఇది ఇలాగే కొనసాగితే హైదరాబాద్ నగరానికి గోదావరి డ్రికింగ్ వాటర్ సప్లై పథకం ద్వారా అందించే నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయి. అందుకే అలాంటి ఇబ్బందులు రాకముందే.. ముందు జాగ్రత్త చర్యగా ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు.

**కీలక ప్రాంతాలకు నీటి సరఫరా..**

ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో ఎక్కువ నీరు ఉంటే, గ్రావిటీ ద్వారా ముర్మూర్ లోని పంప్ హౌజ్ కు తీసుకొచ్చి.. అక్కడి నుంచి పంపింగ్ ద్వారా సిద్దిపేట్ దగ్గర్లోని మల్లారం పంప్ హౌజ్‌కు తరలిస్తారు. తర్వాత అక్కడి నుంచి నగరానికి సప్లై చేసేవాళ్లు. కానీ ఇప్పుడు నీటి మట్టం తగ్గిపోవడంతో ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి తరలింపునకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్‌లోని కీలక ప్రాంతమైన ఐటీ కారిడార్ పరిధిలోకి వచ్చే.. మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, లింగంపల్లి, మియాపూర్, చందానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, కుత్బుల్లాపూర్, అల్వాల్, మల్కాజ్ గిరి తదితర ప్రాంతాలకు గోదావరి జలాల ద్వారానే నీరు అందిస్తున్నారు.

**ఎనిమిదేళ్ల విరామం తర్వాత..**

దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీరు సరఫరా చేశారు. చివరి సారిగా ఇక్కడి నుంచి 2016లో ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోసి హైదరాబాద్‌కు తరలించారు. మరోవైపు ఇప్పటికే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై పథకంలో నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాటు చేసి, నీటిని తరలిస్తున్నారు.

ఎమర్జెన్సీ పంపింగ్ పనులు పరిశీలించిన తర్వాత ఈ పర్యటనలో ఎండీ సుదర్శన్ రెడ్డి ముర్మూర్ లోని గోదావరి డ్రింకింగ్ వాటర్ ప్రాజక్టు పంప్ హౌజ్ ను సందర్శించి, స్కాడా రూం రికార్డులు పరిశీలించారు. ఆ తర్వాత మల్లారంలోని నీటి శుద్ధి కేంద్రాన్ని సైతం సందర్శించారు. అక్కడ నీటి శుద్ధి జరిగే ప్రక్రియ, నీటి పరీక్షల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో కొత్త నీరు చేరే అవకాశం ఉన్నందున...

ఆ సమయంలో గంటకు ఒకసారి శాంపిల్ తీసి టెస్ట్ చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ట్రాన్స్మిషన్ సీజీఎం దశరథ్ రెడ్డి, జీఎం బ్రిజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కేబినెట్ విస్తరణపైకసరత్తు ముమ్మరం

(మొదటి పేజీ తరువాయి)

ఛాన్స్ ఉన్నా, ఈసారి ఐదుగురుకి చోటు కల్పించాలని భావిస్తున్నారట. రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో కొన్ని జిల్లాలకు ఎక్కువ ప్రాతినిధ్యం దక్కగా, కొన్ని జిల్లాలకు అసలు చోటు లేదు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన నేతలెవ్వరూ లేరు. ఈసారి ఆయా జిల్లాలకు ఛాన్స్ ఇవ్వాలన్నది అసలు పాయింట్. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి చాలామంది జాయిన్ అయ్యారు.. మరికొందరు రేపోమాపో కాంగ్రెస్‌లోకి రావాలని భావిస్తున్నారు. తమకు మంత్రివర్గం లో చోటు లేకపోయినా, మిగతా పదవులు ఇవ్వాలని కోరుతున్నట్లు పొలిటికల్ సర్కిల్స్ సమాచారం. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు కాంగ్రెస్ పెద్దలు. వారిలో ముక్తల్ నుంచి శ్రీహరికి రావచ్చని అంటున్నారు. రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, ప్రేమసాగర్, సుదర్శన్‌రెడ్డి, మైనార్టీల నుంచి ఒకరు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచి, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత దాన్ని భర్తీ చేయాలని భావిస్తున్నారట సీఎం రేవంత్‌రెడ్డి. కేబినెట్ విస్తరణ తర్వాత నాలుగైదు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నట్లు సమాచారం.

# తమిళనాడులో కాటేసిన కల్తీ మద్యం

**25 మంది మృతి.. పలువురికి తీవ్ర అస్వస్థత**

**మృతుల సంఖ్య మారిత పెరిగే అవకాశం**

**కల్లకురిచ్చి,జూన్20(నమస్తే ఉదయం):**
తమిళనాడులో దారుణం చోటుచేసుకుంది. కల్లకురిచ్చి జిల్లాలో కల్తీ మద్యం తాగి 32 మంది మృతి చెందారు. మరో 60 మంది వరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే అందులో మరికొందరి పరిస్థితి ఇంకా విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. అంతేకాదు దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం రాత్రి కల్లకురిచి పట్టణంలో ఓ షాపు వద్ద మద్యం పాకెట్లు



కొనుగోలు చేశారు కొందరు వ్యక్తులు. దాన్ని తాగిన తర్వాత వాళ్లు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ముఖ్యంగా తలనొప్పి, వాంతలు, కడుపు నొప్పి, కళ్ల మంటలు వంటి లక్షణాలు మొదలయ్యాయి. వెంటనే వారిని కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. ట్రీట్‌మెంట్ తీసుకుంటూ పలువురు మృతి చెందారు. ఈ విషయం తెలియగానే జిల్లా కలెక్టర్ అలర్టయ్యారు. సీరియస్‌గా ఉన్నవారిని పుదుచ్చేరిలోని జిప్‌మర్ మెడికల్ కాలేజీకి తరలించారు. బాధితుల రక్త నమూనాల ను సేకరించిన అధికారులు.. విల్లుపురం, జిప్‌మర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు పంపించారు. అయితే మద్యంలో మిథనాల్ అనే విష పదార్థం కలిసినట్టు తేలింది. ఈ వ్యవహారంపై స్టాలిన్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ కేసును సీఐడీకి అప్పగించింది. కల్లకురిచ్చి జిల్లా కలెక్టర్, ఎస్పీలను శ్రవణ్‌కుమార్, సమైసింగ్ మీనాను అక్కడి నుంచి బదిలీ చేసింది. అయితే స్థానంలో కలెక్టర్‌గా ఎంఎస్ ప్రసాద్‌ను నియమించింది. జిల్లా ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్‌కు చెందిన డీఎస్పీ తమిళ సెల్వన్ ఆధ్వర్యంలోని టీమ్‌ను సస్పెండ్ చేసింది స్టాలిన్ సర్కార్. ఈ ఘటన విషయం తెలియగానే మంత్రులు, ఈవీ వేలు, సుబ్రమణ్యం కల్లకురిచ్చి ఆసుపత్రిని సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. అటు వైద్య అధికారులతో మాట్లాడిన మంత్రులు, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ ఘటనపై తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కల్తీ మద్యం సేవించి ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్టు ఎక్స్ వేదికగా వెల్లడించారు. మరోవైపు సీఎం స్టాలిన్ ఇవాళ కల్లకురిచ్చి ప్రాంతాన్ని సందర్శించే అవకాశముంది.



గద్వాల పట్టణ కేంద్రంలో ఏటీఎంను ధ్వంసం చేసిన దొంగలు

# గద్వాలలో దొంగల హల్ చల్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 20(నమస్తే ఉదయం):**
జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో దొంగలు హల్ చల్ చేశారు. బుధవారం రాత్రి గద్వాల పట్టణం పాత కూరగాయల సమీపంలో గల పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆవరణలో గల ఏటీఎం మిషన్ ను ధ్వంసం చేసి దొంగతనానికి యత్నించారు. ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు ఏటీఎం ధ్వంసమై ఉండటాన్ని గమనించి బ్యాంకు సిబ్బందికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బ్యాంక్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఏటీఎంను పరిశీలించారు. కాగా.. ఏటీఎం మిషన్ ధ్వంసం చేసిన దొంగలు.. అందులో ఉన్న డబ్బు ఎత్తుకెళ్లారా లేదా అనేది తెలియాల్సి ఉంది. బ్యాంక్ సిబ్బంది గద్వాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. పట్టణం నడిబొడ్డులో ఉన్న ఏటీఎం చోరీకి గురి కావడంతో స్థానికులు భాయాందోళనకు గురయ్యారు. పోలీసులు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి పరిస్థితులు వచ్చేవి కావని వారు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి పూట నిఘా పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ఎం హుస్సేన్‌ను సన్మానించిన హార్టికల్చర్ ఉద్యోగ సంఘం నాయకులు

**రాజేంద్రనగర్, జూన్20(నమస్తే ఉదయం):**
తెలంగాణ రాష్ట్ర ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ ఎం హుస్సేన్ (ముజీబ్)ను హార్టికల్చర్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్




టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ ఎం హుస్సేన్ (ముజీబ్) సన్మానిస్తున్న హార్టికల్చర్ యూనివర్సిటీ ఉద్యోగ సంఘం నేత పోతురాజు యాదయ్య

నాయకులు పోతరాజు యాదయ్య ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ముజీబ్ కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి చెన్ హిరామయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రజనీకాంత్, వైస్ ప్రెసిడెంట్ టి.కుమార్, రామకృష్ణపరమహంస, మూర్తి, బెంజమిన్, శ్రీకాంత్, వెంకటస్వామి, సయ్యద్ జహంగీర్ అలీని సెంట్రల్ యూనియన్ ప్రెసిడెంట్ మారం జగదీష్ కలిశారు. ఉద్యాన విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యపై చర్చించారు.

## ఘనంగా బిజెపి సీనియర్ నాయకులు శీలం తిరుపతి రెడ్డి దంపతుల పెళ్లి రోజు వేడుకలు

**రాజేంద్రనగర్,జూన్ 20(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ బిజెపి నాయకులు శీలం తిరుపతిరెడ్డి 22 వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఆయన నివాసంలో స్నేహితులు,బంధువులు మర్యాద పూర్వకంగా కలిశారు.



వివాహ దినోత్సవ సందర్భంగా బిజెపి నాయకులు శీలం తిరుపతిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న స్నేహితులు

అనంతరం శీలం తిరుపతిరెడ్డి దంపతులతో కేక్ కట్‌చేయించి శాలువా కప్పి సన్మానించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వార్షికోత్సవంలో స్నేహితులు పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి, సూర్ రెడ్డి సాయిరెడ్డి,ఔరాది రమేష్, మాడపాటి కిషోర్ కుమార్,శీలం జగన్మోహన్ రెడ్డి,సూర్ రెడ్డి కరుణాకర్ రెడ్డి,సూర్ రెడ్డి సాయి కృష్ణారెడ్డి, మెక్కొండ ప్రేమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా శక్తి పథకం అమలు తీరుతెన్నులపై రాజేంద్రనగర్‌లో జరిగిన సమీక్షా సమావేశం పాల్గొన్న మంత్రి సీతక్క

# మహిళలకు ఉపాధి కల్పించి ఆర్థిక పురోభివృద్ధికి ప్రభుత్వం కృషి: మంత్రి సీతక్క

### మహిళా శక్తి కార్యక్రమంపై డీఆర్ డీవో అధికారులతో మంత్రి సీతక్క సమీక్షా సమావేశం

**రాజేంద్రనగర్, జూన్20(నమస్తే ఉదయం):**
మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు పరుస్తున్నాం అని గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహిళా ఉన్నతి తోనే తెలంగాణ ప్రగతి సాధ్య పడుతుందన్నారు. ప్రజా పాలనలో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. డిమాండ్ ఉన్న వ్యాపారాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్నామన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థలో గురువారం జరిగిన మహిళా శక్తి సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు.

క్షేత్రస్థాయి వాస్తవాలకు, ప్రజల అవసరాలు, వనరుల లభ్యతకు తగ్గట్టుగా బిజినెస్ మోడల్ ఉండాలన్నారు.

స్థానికంగా లభ్యమయ్యే వస్తువుల ఆధారంగా వ్యాపారం చేస్తే అద్భుతాలు సాధించగలమని తెలిపారు.

ఆధార్ కేంద్రాలు, మీ సేవ సెంటర్లు, పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలు, క్యాంటీన్లు, స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసేలా మహిళా సంఘాలకు రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు

మహిళా శక్తి క్యాంటీన్లలో రుచి, శుభ్రత బాగా వుండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్ కావాలన్నారు.

పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారుల వెంట, రద్దీ ప్రాంతాల్లో మహిళా క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

కల్తీ భయంతో బయట తినాలంటేనే ప్రజలు భయపడుతున్నారని గుర్తు చేశారు. పాలను కూడా కల్తీ చేస్తున్నారన్నారు. అందుకే కల్తీ వస్తువుల పైన యుద్ధం చేయాలన్నారు. ఆరోగ్యం సరిగా లేకపోతే ఎంత డబ్బు వున్న నిరుపయోగమే అన్నారు. అందుకే మహిళా శక్తి క్యాంటీన్‌లు క్వాలిటీపై రాజీ పడొద్దన్నారు. పల్లె రుచులు, ఇప్ప పువ్వు లడ్డులు, నన్నారి వంటి సాంప్రదాయిక పానీయాలను పట్టణాలకు పరిచయం చేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల స్కూల్ యూనిఫామ్‌లను సకాలంలో కుట్టించి పంపిణీ చేసిన డీఆర్‌డీవోలకు, అధికారులకు అందరికీ అభినందనలు తెలియచేసారు.

మార్పుచూయించి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారన్నారు. గ్రామీణ మహిళల ఆర్థిక స్థితిగతులను మార్చి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అక్షర జ్ఞానం అంతగా లేనీ మహిళలనూ ఆర్థిక వేతలుగా మార్చేలా కృషిచేస్తున్నాం అన్నారు. గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలన లక్ష్యం అని గుర్తు చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే సెర్ప్ ఏర్పాటయిందన్నారు. దాన్ని మరింత పటిష్ట పరిచి సేవలను విస్తరిస్తాం అన్నారు. కాంగ్రెస్ అంటేనే మహిళా పక్షపాతి అని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ ప్రధానిగా దేశానికి ఎంతో సేవ చేశారని తెలిపారు. సోనియా సోనియా గాంధీ తెలంగాణ కలను సహకారం చేశారన్నారు.

వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ చేతుల్లో మహిళలో ఎంతో నష్టపోయారని వాపోయారు.

అందుకే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వమే అందజేస్తోందన్నారు. వచ్చే ఐదు సంవత్సరాలలో మహిళా సంఘాలకు లక్ష కోట్ల బ్యాంక్ రుణాలు అందిస్తాం అన్నారు.

మహిళా సంఘాల కోసం మంచి బిజినెస్ మోడల్ లను అధికారులు గుర్తించండి అని సూచించారు. ప్రజా సేవకు మించిన తృప్తి లేదన్నారు.

ఆర్డీఓలు జిల్లాలో పర్యటించి మహిళా సంఘాల అనుభవాలు తెలుసుకోవాలన్నారు.

వారం రోజులపాటు ఒక డ్రైవ్ నిర్వహించాలన్నారు.

మహిళ బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు.

మహిళలు ఇతరుల మీద ఆధారపడకుండా తమ కాళ్ళ మీద నిలబడేలా అధిక సాధికారత సాధించాలన్నారు.

మహిళలు అభివృద్ధి చెందిన తర్వాత ప్రభుత్వాలకే రుణాలు ఇచ్చే స్థాయికి ఎదుగా లని ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్లతో త్వరలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తాం అని తెలిపారు. ల్యాండ్ కేటాయింపులు మొదలుకుని..ప్రభుత్వ రాయితీల వరకు సహకరించమని కలెక్టర్లకు చెప్తామన్నారు. మహిళలను కోటీశ్వరులుగా చేయడమే అధికారుల లక్ష్యం కావాలన్నారు.

గొప్ప లక్ష్యాన్ని చేరుకున్నమన్న సంతృప్తి అధికారులకు కలిగినప్పుడే ప్రభుత్వం సక్సెస్ అవుతుందన్నారు. మహిళా శక్తి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించు కుందాం.. మంత్రిగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాన న్నారు. హైదరాబాద్ నలుమూలల శిల్పారామాలు ఏర్పాటు చేసి ద్వాక్రా బజార్లను ప్రారంభించాలన్నారు. ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవద్దని అధికారులకు సూచించారు.

మహిళా సంతోషంగా ఉంటే కుటుంబ సంతోషంగా ఉంటుంది.. కుటుంబం సంతోషం ఉంటే మీ.. రాష్ట్రం, దేశం సంతోషంగా ఉంటుందన్నారు. అన్ని సమస్యలకు ఆర్థిక సమస్యలే మూలం అని గుర్తు చేశారు.

కుటుంబము ఆరోగ్యంగా ఉండాలంటే మహిళా ఆర్థిక ప్రగతి మీదే ఆధారపడి ఉంటుందన్నారు. మహిళా శక్తికి అధికారులే బ్రాండ్ అంబాసిడర్లన్నారు. ఆగస్టు 15న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో జత యూనిఫామ్ ఇచ్చేలా మహిళా సంఘాలు పనిచేయాలని తెలిపారు.

# నులి పురుగులను తరిమేద్దాం..

### పిల్లలకు తప్పనిసరిగా నూలిపురుగుల మందులు ఇవ్వాలి : కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి


**రాజేంద్రనగర్,జూన్ 20 (నమస్తే ఉదయం):**
1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు తప్పకుండా వారి ఆరోగ్యకరమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తు కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే,కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మైలార్ దేవ్ పల్లి జిల్లా ఉన్నత పాఠశాల లో హెల్త్ డిపార్మెంట్, జీహెచ్ ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంలో రాజేంద్రనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..1-19 సంవత్సరాల వయస్సు పిల్లలకు అల్బెండ జోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా పిల్లలకు నులిపురుగుల మాత్రలు వేయించడం ద్వారా రక్త హీనత తగ్గి పోషణ, మెరుగు పడుతుందన్నారు.

పిల్లలకు మెరుగైన మానసిక అభివృద్ధి, మెరుగైన శారీరక అభివృద్ధి, మెరుగైన అభ్యాసం,చురుకుదనం మెరుగైన పాఠశాల హాజరు అనేక ప్రయోజనాలు కలుగు తాయన్నారు. పిల్లలకి గోర్లు శుభ్రంగా, చిన్నవిగా ఉంచుకోవాల న్నారు. ఎల్లపుడూ పరిశుభ్రమైన నీటిని త్రగాలన్నారు.తినే పదార్థాలపై మూతలు పెట్టాలన్నారు.

పండ్లు, కూరగాయలు శుభ్రమైన నీటితో కడగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓసి రాజుద్దీన్, కేశవ్,స్రవంతి,మమత గ్లోరీ, రేఖ,డీఈఓ శైలేందర్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్,శ్రీలత, నర్షాద్,సమేష్, టి.చిన్న,శశిధర్, పాండుయాదవ్, మధు,శంకర్ రెడ్డి,రవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందును వేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



బ్రహ్మోత్సవాలలో స్వామివారి దర్శనం కోసం క్యూలో నిలబడ్డ భక్తులు

## రెండవ రోజు కొనసాగిన శ్రీకోటిలింగేశ్వర దత్తదేవస్థానము సప్తమాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

**కొత్తకోట, జూన్ 20(నమస్తే ఉదయం):**
వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయ పల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానము సప్తమాదశ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకోటి లింగేశ్వర దత్తదేవస్థానములో రెండవ రోజు శ్రీకోటిలింగేశ్వరస్వామివారికి పుష్పాభిషేకం బిళ్వాభిషేకం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పుష్ప బిల్వాభిషేకంలో పాల్గొని పాల్గొన్నారు. అనంతరం ఆలయకమిటి భక్తులకు అన్నదానం చేశారు.



# సన్నీడియోల్, గోపీచంద్ కాంబో రెడీ

బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ 2023లో బిగ్గెస్ట్ గ్రాసర్‌గా నిలిచిన తన లాస్ట్ ఔటింగ్ 'గదర్ 2'తో స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇచ్చారు. నాలుగు దశాబ్దాలకు పైగా కెరీర్‌లో 100 సినిమాల దిశగా దూసుకుపోతున్న సన్నీ డియోల్ యాంగ్రీ యాక్షన్ హీరోగా అలరిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పై రవి శంకర్, నవీన్ యెర్నేని, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టిజి విశ్వ ప్రసాద్ సంయుక్తంగా, గ్రాండ్‌గా నిర్మించే స్ట్రెయిట్ హిందీ సినిమా కోసం బ్లాక్‌బస్టర్ మెషిన్ గోపీచంద్ మలినేనితో చేతులు కలిపారు సన్నీ డియోల్.

క్రాక్, వీరసింహా రెడ్డి వంటి రెండు వరుస బ్లాక్‌బస్టర్‌లను అందించిన దర్శకుడు గోపీచంద్ మలినేని అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ కూడిన సక్సెస్ ఫుల్ స్క్రిప్ట్‌తో చిత్రాన్ని మ్యాసీవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నారు. ఇది గోపీచంద్ మలినేని మేడిన్ హిందీ మూవీ. మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో హీరోని ప్రెజెంట్ చేయనున్నారు. సౌత్ దర్శకులతో బాలీవుడ్ స్టార్ల సినిమాలపై నార్త్ ప్రేక్షకులు కూడా ప్రత్యేక ఆసక్తిని కనబరుస్తున్నారు.

మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా స్టార్‌లతో హై-బడ్జెట్ సినిమాలు తీయడంలో ప్రసిద్ధి చెందాయి. రెండు నిర్మాణ సంస్థలు, డైరెక్టర్ సరైన సమయంలో సరైన మూవీతో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. హై ప్రొడక్షన్, టెక్నికల్ వాల్యూస్ బిగ్ కాన్వాస్‌పై రూపొందనుంది. హైదరాబాద్‌లో కోర్ టీమ్, ప్రత్యేక అతిథులతో సినిమా గ్రాండ్ గా లాంచ్ అయ్యింది.

# నందమూరి బాలయ్యకు నిర్మాతల మండలి అభినందనలు

నందమూరి బాలకృష్ణ తెలుగు సినీ ఇండస్ట్రీలో 50 ఏళ్ళు పూర్తి చేసుకున్నారు. అద్భుతమైన బ్లాక్ బస్టర్ విజయాలు సాధిస్తూ ఎప్పుడూ ముందంజలో ఉంటారు.

అదేవిధంగా బసవతారకం హాస్పిటల్ తో బిజీగా ఉండి కూడా ఎంతోమందికి సేవలందిస్తూ సేవా కార్యక్రమాలలో ముందుంటారు. ఇటీవల వరస మూడు సినిమాలు బ్లాక్ బస్టర్ విజయం సాధించడంతో హ్యాట్రిక్ హీరోగా నిలబడ్డారు. అంతేకాకుండా హిందూపూర్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిచి హ్యాట్రిక్ లీడర్ అనిపించుకున్నారు అదేవిధంగా ప్రజలకు ఎన్నో విధాలుగా ఎంతో సేవ చేస్తున్నారు. 2024 లో ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో హిందూపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన శ్రీ నందమూరి బాలకృష్ణ గారికి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపిన తెలుగు చలనచిత్ర నిర్మాత మండలి అధ్యక్షులు శ్రీ కె. ఎల్. దామోదర్ ప్రసాద్ గారు, కార్యదర్శి శ్రీ టి. ప్రసన్నకుమార్ గారు, మరియు
ఈసీ మెంబర్ శ్రీ వి. వెంకటరమణ రెడ్డి (దిల్ రాజు) గారు, తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు శ్రీ వి. వెంకటరమణ రెడ్డి (దిల్ రాజు) గారు, కార్యదర్శి శ్రీ కె. ఎల్. దామోదర్ ప్రసాద్ గారు మరియు కోశాధికారి శ్రీ టి. ప్రసన్నకుమార్ గారు, తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి శ్రీ కె. అనుపం రెడ్డి గారు మరియు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ మాదాల రవి.



# అహో! విక్రమార్క టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నా.. దేవ్ గిల్

బ్లాక్‌బస్టర్ 'మగధీర'తో సహా పలు దక్షిణ భారత చిత్రాలలో విభిన్న పాత్రలు, ఆకర్షణీయమైన నటనతో దేవ్ గిల్ అందరినీ ఆకట్టుకున్నారు. ప్రస్తుతం ఆయన నేతృత్వంలో దేవ్ గిల్ ప్రొడక్షన్స్ నుంచి 'అహో! విక్రమార్క' అనే మొదటి ప్రాజెక్ట్ రాబోతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో..దేవ్‌గిల్ మాట్లాడుతూ.. 'మగధీర నుంచి నా మీద ప్రేమను కురిపిస్తూనే ఉన్నారు. పూణెలో మా తల్లిదండ్రులు జన్మనిచ్చి ఉండొచ్చు.. కానీ హైద్రాబాద్‌లో రాజమౌళి గారు నాకు పేరు ఇచ్చారు. రమా గారు నాకు తల్లిలా సపోర్ట్ ఇచ్చారు. వారి వల్లే ఈ రోజు 'అహో విక్రమార్క' అనే చిత్రాన్ని నిర్మించగలిగాను. 12, 13 ఏళ్ల క్రితం రాజమౌళి గారు నన్ను ముంబై నుంచి పట్టుకొచ్చి నాకు లైఫ్ ఇచ్చారు. ఇప్పుడు నేను హీరోగా సినిమాను తీశాను. నాకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. నన్ను ఇంత వరకు విలన్‌గా చూశారు. నా మీద ప్రేమను కురిపించారు. కానీ ఈ సినిమాతో మీ అందరికీ సర్ ప్రైజ్ ఇవ్వబోతోన్నాను. త్రికోటి గారికి చాలా పెద్ద విజన్ ఉంది. మా టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. త్వరలోనే పాటలు



కూడా రిలీజ్ చేస్తాం. మా సినిమా మీద ఆడియెన్స్ ప్రేమను కురిపించి, ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.
దేవ్‌గిల్ భార్య, నిర్మాత ఆర్తి మాట్లాడుతూ.. 'మా కల నెరవేరబోతోంది. ఇదే మాకు మొదటి చిత్రం. మా ప్రొడక్షన్ నుంచి మొదటి చిత్రం రాబోతోంది. తెలుగు ప్రేక్షకులకు ఇప్పటి వరకు మా మీద ఎంతో ప్రేమను కురిపిస్తూ వచ్చారు. ఈ చిత్రం చాలా కొత్తగా ఉండబోతోంది. టెక్నికల్‌గా ఈ సినిమా అద్భుతంగా ఉంటుంది. అందరూ మా సినిమాను ఆదరించండి' అని అన్నారు.

# తీస్ మాస్ బ్యూటీ

15 ఏళ్ల క్రితం బోణీ సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ కృతి కర్బంద. ఇటీవలే ఈ అమ్మడు తన సినీ కెరీర్ 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమోషనల్ పోస్ట్‌ని షేర్ చేసింది. సోషల్ మీడియాలో ఈ అమ్మడికి మంచి ఫాలోయింగ్ ఉండటంతో ఆ పోస్ట్ కాస్త వైరల్ అయ్యింది. తన జీవితంలో ఎక్కువ శాతం నటిగానే కొనసాగడం చాలా సంతోషంగా ఉందని చెప్పుకొచ్చింది. బిజీ బిజీగా సినిమాలు చేయకున్నా కూడా తెలుగు, హిందీ ఇతర భాషల్లో క్రమం తప్పకుండా సినిమాలు చేస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచడం చాలా సంతృప్తిని కలిగించిందని కూడా పేర్కొంది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అయ్యాయి. 35 ఏళ్ల వయసులో ఈ అమ్మడు ఇంకా కూడా 20 ఏళ్ల పడుచు అమ్మాయి అన్నట్లుగానే ఉందంటూ నిరూపించే విధంగా ఈ ఫోటోలు ఉన్నాయి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. విభిన్నమైన ఈ ఔట్ ఫిట్ లో పై బటన్ పెట్టి షర్ట్ మొత్తం కింది బటన్స్ వదిలేయడం ద్వారా భలే క్రేజీగా ఉందంటూ నెటిజన్స్ చర్చించుకుంటున్నారు. ఇలాంటి డిఫరెంట్ స్టైల్ ఔట్ ఫిట్‌ను ధరించేందుకు, దాంతో మెప్పించేందుకు ఘట్స్ కావాలని, ఆ ఘట్స్ ఈ అమ్మడికే ఉన్నాయంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు లో రామ్ చరణ్ కి అక్క పాత్ర లో బ్రూస్ లీ సినిమాలో నటించింది. ఆ తర్వాత నుంచి పెద్దగా కనిపించలేదు.





# గ్రేటెస్ట్ లెజెండ్స్‌తో వర్క్ చేయడం.. ఇట్స్ బిగ్గర్ దెన్ డ్రీం: రెబల్ స్టార్ ప్రభాస్

మోస్ట్ ఎవైటెడ్ అప్ కమింగ్ సైన్స్ ఫిక్షన్ ఎపిక్ 'కల్కి 2898 ఎడి', విజనరీ ఫిల్మ్ మేకర్ నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేసిన ఈ విజువల్ వండర్ లో ఇండియన్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె, దిశా పటానీ నటిస్తున్నారు. వైజయంతీ మూవీస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఫెంటాస్టిక్ ప్రమోషనల్ కంటెంట్ తో గ్లోబల్ వైడ్ గా సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్స్ కి గ్రౌండ్ బ్రేకింగ్ రెస్పాన్స్ వచ్చింది. 'భైరవ అంథమ్' ఇండియన్స్ బిగ్గెస్ట్ సాంగ్ ఆఫ్ ది ఇయర్ గా టాప్ చార్ట్ లో వుంది.

ఈ మల్టీలింగ్వెల్, మైథాలజీ -ఇన్స్ స్పైర్డ్ సైన్స్ ఫిక్షన్ విజువల్ వండర్ జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపధ్యంలో మేకర్స్ ముంబై లో గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లో కల్కి టీంతో హ్యాండ్సమ్ హంక్ రానా దగ్గుబాటి ఇంటరాక్షన్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచింది. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ.. కల్కి 2898 ఎడి' లో పార్ట్ అవ్వడం గ్రేట్ హానర్. ట్రూలీ వండర్ ఫుల్ ఎక్స్ పీరియన్స్. ఇది ఓ కొత్త ప్రపంచం. ఇలాంటి సినిమా గతంలో ఎప్పుడూ చేయలేదు. ఇలాంటి సినిమాని అలోచించిన నాగ్ అశ్విన్ కి, టీం అందరికీ అభినందనలు. నాగి ఈ కథ చెప్పినపుడు చాలా ఆశ్చర్యపోయాను.

అసలు ఏం డ్రింక్ చేస్తే ఇలాంటి కథని అలోజించగలిగాడనిపించింది. ఇందులో వున్న విజువల్స్ అన్ బిలివబుల్. ఇలాంటి ఫ్యుచరిస్టిక్ ప్రాజెక్ట్ ని తీయడం మహా అద్భుతం. తను అనుకున్న విజన్ ని వండర్ ఫుల్ గా స్క్రీన్ పై ప్రజెంట్ చేశారు. కల్కి ఎక్స్ పీరియన్స్ ని ఎప్పటికీ మర్చిపోలేను' అన్నారు.

రెబల్ స్టార్ ప్రభాస్ మాట్లాడుతూ.. గ్రేటెస్ట్ లెజెండ్స్ తో వర్క్ చేసే అవకాశం ఇచ్చిన దత్తు గారు, నాగీ గారికి థాంక్ యూ. ఇట్స్ బిగ్గర్ దెన్ డ్రీం. అమితాబ్ గారు కంట్రీ మొత్తం రీచ్ అయిన ఫస్ట్ యాక్టర్. కమల్ సార్ సాగరసంగమం చూసి కమల్ హాసన్ గారి లాంటి డ్రెస్ కావాలని మా అమ్మని అడిగాను. అలాగే ఇంద్రుడు చంద్రుడు చూసి కడుపులో క్లాత్ చుట్టుకొని ఆయనలానే యాక్ట్ చేసేవాడిని. అలాంటి లెజెండ్స్ తో యాక్ట్ చేయడం అన్ బిలివబుల్. అలాగే దీపిక ఇంటర్నేషనల్ లెవల్ కి రీచ్ అయిన స్టార్. దీపికతో నటించడం బ్యూటీఫుల్ ఎక్స్ పీరియన్స్. అందరికీ థాంక్ యూ' అన్నారు.



# "ధూం ధాం" సెకండ్ సింగిల్ లిరికల్

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది."ధూం ధాం" సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ సక్సెస్ ఫుల్ గా సాగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన 'మల్లెపూల టాక్సీ..' పాట ఛాట్ బస్టర్ అయ్యింది. మంగ్లీ పాడిన ఈ పాట ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యింది. తాజాగా "ధూం ధాం" సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'మాయా సుందరి..' విడుదల చేశారు. ఈ పాటకు సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా..గోపీ సుందర్ మంచి బీట్ తో కంపోజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి పాడారు. 'మాయా సుందరి.. హే మాయా సుందరి..నా మాయా సుందరి.. ఎక్కడున్నావో మరి..
గుప్పెడు గుండెను నువ్వే పట్టుకు పోయావే, నా రెప్పల నిద్దురనంతా ఎత్తుకు పోయావే..' అంటూ సాగుతుందీ పాట. హీరో పాడుకునే లవ్ సాంగ్‌గా 'మాయా సుందరి..' పాటను స్టైలిష్‌గా రూపొందించారు.

# "ది కానిస్టేబుల్"గా వరుణ్ సందేశ్ నట విశ్వరూపం

వరుణ్ సందేశ్ హీరోగా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వం లో జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ నిర్మిస్తున్న చిత్రం "ది కానిస్టేబుల్". వరుణ్ సందేశ్ కి జోడిగా మధులిక వారణాసి హీరోయిన్ గా తొలిపరిచయం కానున్నారు. ఈ సినిమా బుధవారం నాటితో హైదరాబాద్ లో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, "సినిమా షూటింగ్ అంతా చాలా హాయిగా సాగింది. త్వరలో కానిస్టేబుల్ పాత్ర లో కొత్తకోణంలో, ఒక థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను" అని చెప్పారు. నిర్మాత బలగం జగదీష్ మాట్లాడుతూ, "కథ, కథనాలు అద్భుతంగా అమరిన చిత్రమిది. పోలీస్ పాత్రలో వరుణ్ సందేశ్ ఆకట్టుకుంటారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి" అని పేర్కొన్నారు. దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె. మాట్లాడుతూ, సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో వరుణ్ సందేశ్ నట విశ్వరూపం చూడవచ్చు. త్వరలో ఈ చిత్రం పాటలను, మోషన్ పోస్టర్ ను విడుదల చేస్తామని అన్నారు.




**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.